క్లుప్తంగా

అభివృద్ధి పనులపై క్వాలిటీ కంట్రోల్ పర్యవేక్షణ

సాక్షి ఎఫెక్ట్..

విశాఖ విద్య: రహదారుల నిర్మాణం, అభివృద్ధి పనులపై క్వాలిటీ కంట్రోల్ పర్యవేక్షణ ఉంటుందని జోన్–8 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చిరంజీవి ప్రకటనలో తెలిపారు. 'మనోడే..వదిలేయ్' శీర్షికన గురువారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనంపై జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించారు. రహదారి నిర్మాణ పనుల్లో డొల్లతనంపై జీవీఎంసీ జోన్–8 అధికారులను వివరణ కోరిన నేపథ్యంలో వీటిపై ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించారు. ఎస్‌పీడీ–గోపాలపట్నం బీఆర్‌టీఎస్ రోడ్‌లోని బాజీ జంక్షన్ నుంచి గోపాలపట్నం మీదుగా చంద్రానగర్ పాత్ వరకు, అక్కడి నుంచి నాగేంద్ర నగర్ వరకు రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు వెల్లడించారు. ఈ పనులపై క్వాలిటీ కంట్రోల్ పర్యవేక్షణ చేస్తుందని ఈఈ చిరంజీవి వెల్లడించారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



బహుమతులు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

విశాఖ విద్య: గోపాలపట్నం శాఖా గ్రంథాలయంలో ఈనెల 14 నుంచి జరుగుతున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ముగిశాయి. ముఖ్యఅతిథిగా గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఎల్లపు చిన అప్పారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు వినియోగించుకుంటే అభివృద్ధి చెందవచ్చని చెప్పారు. అలాగే వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. గోపాలపట్నం శాఖ గ్రంథాలయాధికారి ఎన్‌వీ నరసింహం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యులు మిద్ది అప్పారావు, గొరకల రామదాసు, చందు సుబ్బారావు, విశ్రాంత ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ఎంఎస్‌వీ శ్రీనివాస్, మేఘాద్రిగెడ్డ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల గ్రంథాలయాధికారి కె.మాధవి లత, రచయిత్రి దామరాజు విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రంథాలయ అధికారి నరసింహంను సత్కరించారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ వంశీ సూపర్ మార్కెట్ నుంచి అమ్మవారి పాదాల వరకు రూ.18 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్ నిర్మాణ పనులను కార్పొరేటర్ బొమ్మిడి రమణ గురువారం పరిశీలించారు. రహదారుల నిర్మాణ పనుల్లో నాణ్యత ఉండేలా ఇంజినీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. వార్డు పరిధిలోని కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి కార్యాచరణ సిద్ధం చేశామని, ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పబ్లిక్ వర్క్స్ ఏఈ వెంకటలక్ష్మి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మనాలిలో ఏయూ విద్యార్థుల బృందం



మనాలి సాహస శిబిరంలో పాల్గొంటున్న ఏయూ విద్యార్థుల బృందం

విశాఖ విద్య: మనాలిలో జరుగుతున్న జాతీయ సేవా పథకం వలంటీర్ల ప్రత్యేక సాహస శిబిరానికి ఆంధ్రా యూనివర్సిటీ నుంచి పది మంది విద్యార్థుల బృందం వెళ్లింది. వీరు రాక్ క్లైమ్బింగ్, రివర్ రాఫ్టింగ్ వంటి సాహస కృత్యాల్లో భాగస్వాములవుతారు. న్యాయ కళాశాల ఆచార్యులు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పల్లవి సారథ్యంలో మనాలి పర్యటనకు వెళ్లిన విద్యార్థులు సాహస శిబిరంలో ప్రత్యక్షంగా పాల్గొంటారు.



హిందూ శ్మశాన వాటికలో ఇంకా పునాదుల్లోనే ఉన్న నిర్మాణం



గతంలో ఉన్న ప్రవేశ మార్గం ఆర్చ్ (ఫైల్)

ఆఖరి మజిలీకి అవస్థలు

- కరాస శ్మశాన వాటికలో వెంటాడుతున్న అసౌకర్యాలు
- హిందూ, ముస్లిం, క్రిస్టియన్లకు ఒకే చోట శ్మశాన వాటిక
- మౌలిక వసతుల కల్పనకు రూ.1.98 కోట్లు జీవీఎంసీ నిధులు
- ప్రాధాన్యత గల పనులపై అధికారుల అలసత్వం
- నత్తనడకన పూర్తి కాని పనులు, దహన సంస్కారాలకు ఇబ్బందులు



శ్మశాన వాటికలో ఈశ్వరుడికి నీడనిచ్చేదెప్పుడో..

విశాఖ విద్య: పశ్చిమ నియోజకవర్గంలోని ఎన్‌ఏడీ కూడలి కరాసలో ఒకే చోట హిందూ, ముస్లిం, క్రిస్టియన్ల కోసమని శ్మశాన వాటికలను ఏర్పాటు చేశారు. మత సామరస్యానికి ఇదో ప్రతీకగా నిలుస్తోంది. 52, 57,90 వార్డుల పరిధిలోని కాలనీల్లో దహన సంస్కారాలు నిర్వహించేందుకు కరాస శ్మశాన వాటికకు తీసుకొస్తారు. ఆయా మతాల ఆచార వ్యవహారాలకు మేరకు అంతిమ మజిలీ చేసుకునేలా శ్మశాన వాటికలో మౌలిక సౌకర్యాలు లేకపోవటంతో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ దీని అభివృద్ధికి నిధులు కేటాయించేలా ప్రత్యేక చొరవ తీసుకున్నారు. మౌలిక వసతుల కల్పన కోసమని చేపట్టిన పనులు నత్తనడకన సాగుతుండటంతో ప్రస్తుతం శ్మశాన వాటికలో దహన సంస్కారాలకు ఇబ్బందులు ఎదురౌతున్నాయని ఈ ప్రాంత వాసులు అంటున్నారు.

నిధులున్నా నత్తనడకన పనులు

శ్మశాన వాటికలో అవసరమైన మౌలిక సౌకర్యాలు పెంపొందించేలా రూ.1.98 కోట్లు మంజూరు చేశారు. క్రిస్టియన్ శ్మశాన వాటికలో అధునాతన ప్రేయర్ హాల్, హిందూ శ్మశాన వాటికలో మోడ్రన్ బర్నింగ్ ప్లాట్‌ఫారం, శ్మశాన వాటిక వెనుక ఉన్న గెడ్డను అనుసంధానం చేస్తూ డ్రైన్స్, ప్రాంగణంలో గ్రీనరీ పెంపు, వెయిటింగ్స్ హాల్స్ వంటి పనులు చేపట్టేలా ప్రతిపాదనలు చేశారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే ఈ శ్మశాన వాటికి ప్రవేశ మార్గంలో ఆర్చ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ పనులన్నీ ఇంకా పునాదుల దశలోనే ఉన్నాయి. ప్రవేశ మార్గంలో గతంలో ఉన్న ఆర్చ్‌ని తొలగించిన అధికారులు, కొత్తగా ఏర్పాటు చేసే విషయంలో తాత్సారం చేస్తున్నారు.

నాణ్యత లేని పనులు

శ్మశాన వాటికలో మౌలిక వసతుల కల్పనకు రూ.1.98 కోట్లు మంజూరు చేయడం హర్షణీయం. అయితే చేపడుతున్న పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం వెయిటింగ్ హాల్స్, ఇతర నిర్మాణాలు జరుగుతుండగా, కాంక్రీట్ పటిష్టత లేకుండా మెటల్ తేలిపోతోంది. శ్మశాన వాటికలో పనులే కాదా..అని అధికారులు అటువైపు చూడడం లేదు.

ప్రాంగణంలో అల్లుకొన్న పొదలు

శ్మశాన వాటికలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. ముస్లిం శ్మశాన వాటికలో ఉన్న చేతి పంపు వద్దకు వెళ్లే పరిస్థితి లేదు. ప్రాంగణంలో పొదలు అల్లుకోవటంతో పాములు స్వైర విహారం చేస్తున్నాయని పలువురు అంటున్నారు. ప్రాంగణమంతా పిచ్చి మొక్కలు,పొదలు పెరుగటంతో దహన సంస్కారాలకు వెళ్లే వారిలో, ఎక్కువమంది బయట రోడ్డుపైనే నిలుబడాల్సి వస్తోంది. మౌలిక వసతుల పెంపు పేరుతో చేపట్టే పనులు ఇప్పట్లో పూర్తయ్యే పరిస్థితులు లేనందున, ప్రాంగణాన్ని శుభ్రంగా చేస్తే బాగుంటుందని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.



పునాదుల పిల్లర్ వద్ద పటిష్టంగా లేని కాంక్రీట్



ముస్లిం శ్మశాన వాటికలో చేతిపంపు చుట్టూ పిచ్చిమొక్కలు

మళ్లీ ఆక్రమణ

మల్కాపురం : జింక్ నుంచి గాజువాక ఆర్టీసీ డిపో వరకు గల సేవా మార్గానికి ఇరువైపులా ఫుట్‌పాత్‌లు, సేవా మార్గాలను ఆక్రమిస్తూ పాదచారులకు ఇబ్బంది కలిగిస్తున్నారు. దీనిపై నడిచేదెలా అంటూ ఈ నెల 19న సాక్షిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన ట్రాఫిక్ పోలీసులు, సచివాలయ టౌన్ ప్లానింగ్ అధికారులు సంయుక్తంగా ఆక్రమణలను తొలగించారు. జింక్ నుంచి గాజువాక ఆర్టీసీ డిపో వరకు ఫుట్‌పాత్‌లు, సేవా మార్గాలను ఆక్రమించి ఏర్పాటు చేసిన అనాధికార వ్యాపారాలను తొలగించారు. దీంతో ఆయా ప్రాంతాల పాదచారులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం వీటిని తొలగిస్తే.. గురువారం మళ్లీ కొత్తగా షాపులు వెలుస్తున్నాయి. గాజువాక ఆర్టీసీ డిపో వద్ద ఫుట్‌పాత్‌పై ఓ వస్త్ర వ్యాపారి విక్రయాలు ప్రారంభించాడు. అధికారులు తొలగించాలని ఆదేశించినా లెక్కచేయలేదు. ట్రాఫిక్ పోలీసులతో వాగ్వాదానికి దిగాడు. ఇలాగే మరి కొన్ని ప్రాంతాల్లో కూడా వ్యాపారులు ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు చేసుకునేందుకు సిద్ధపడుతున్నారు. శుక్రవారం నుంచి మళ్లీ డ్రైవ్ నిర్వహిస్తామని, ఫుట్‌పాత్‌లు, సేవామార్గాలు ఆక్రమించి చేస్తున్న వ్యాపారాలకు చెక్ పెడతామని సచివాలయ అధికారులు తెలిపారు. నక్కవానిపాలెం,కోరమాండల్ వంటి ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు.



జింక్ ఆంజనేయస్వామి ఆలయం వెనుక ఆక్రమణలు తొలగించటంతో విశాలంగా కనిపిస్తున్న ఫుట్‌పాత్



గాజువాక ఆర్టీసీ డిపో వద్ద ఫుట్‌పాత్‌పై ట్రాఫిక్ పోలీసులతో వస్త్రవ్యాపారి వాగ్వాదం



జింక్ వద్ద బుధవారం తొలగించిన షాపులు గురువారం మళ్లీ ఏర్పాటైన దృశ్యం

కార్మిక వ్యతిరేక విధానాలతోనే బీజేపీ పాలన

మల్కాపురం: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ పాలన అంతా కార్మిక వ్యతిరేక విధానాలతోనే నడుస్తోందని పారిశ్రామిక ప్రాంత అఖిలపక్ష యూనియన్ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. 61వ వార్డు వెంకన్నపాలెంలోని సీఐటీయూ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన అఖిల పక్ష కార్మిక నాయకుల సమావేశంలో సిటూ మల్కాపురం జోన్ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణమూర్తి, పెంటారావు మాట్లాడారు. బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలపై ఈ నెల 24న పాత గాజువాక నుంచి కొత్త గాజువాక వరకు నిరసన ర్యాలీ, అనంతరం సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 26న డీఆర్‌ఎం కార్యాలయం నుంచి జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వరకు ర్యాలీ, సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సభలకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఏఐటీయుసీ నాయకులు కె.సత్యనారాయణ, గుడాల రాంబాబు, ఐఎన్‌టీయూసీ నాయకులు తాతబాబు, నర్సింగ్‌యాదవ్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టి, వేలాది మంది కార్మికులను రోడ్డున పడేయాలనే యోచనలో బీజేపీ నాయకులు ఉన్నారని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి పాలన చేపట్టి ఐదు నెలలు గడుస్తున్నా.. నేటికీ ఒక్క నిరుద్యోగికీ ఉపాధి కల్పించకపోవడం దారుణమన్నారు. ఈ నెల 24, 26 తేదీల్లో గాజువాక, నగరంలోని డీఆర్‌ఎం కార్యాలయాల వద్ద చేపట్టనున్న ర్యాలీలకు కార్మికులంతా హాజరు కావాలని కోరారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అఖిలపక్ష యూనియన్ నాయకులు

ప్రొఫెసర్ బి.ఆర్.రావు సేవలు అమోఘం

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గురువారం ఆచార్య బి.ఆర్.రావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏయూ ప్రాంగణంలోని ఫిజిక్స్ విభాగం వద్ద గల ఆయన విగ్రహానికి వీసీ ఆచార్య జి.శశిభూషణరావు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ శాస్త్రీయ పరిశోధనలో, విద్యా రంగంలో ఆచార్య బి.ఆర్.రావు అందించిన అద్భుతమైన సేవలతో ప్రపంచం ఇప్పటికీ ఆయనను గుర్తుంచుకుందన్నారు. ఏయూలో స్పేస్ ఫిజిక్స్ లేబరేటరీ ఏర్పాటు చేయడంలో బి.ఆర్.రావు చేసిన కృషిని వివరించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి జాతీయ స్థాయిలో విశేష గుర్తింపును తీసుకొచ్చారని, నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, విభాగాధిపతి ఆచార్య శ్రీనివాసరావు, ఏయూ పూర్వ రెక్టార్ ఆచార్య కె.సమత, డీన్ ఆచార్య కె.బసవయ్య ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ మాజీ వీసీ డాక్టర్ శ్యాంప్రసాద్, వివిధ శాఖాధిపతులు, ఉద్యోగులు, పరిశోధకులు, విద్యార్థులు, మత్స్యకార సంఘం నేతలు పాల్గొన్నారు.



బి.ఆర్.రావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు తదితరులు

ఆధ్యాత్మిక జీవనమే ఉన్నతం



సోక్రటీస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

విశాఖ విద్య: ఆధ్యాత్మిక జీవనమే ఉన్నతమైనదని ఐఏఎస్‌ఈ ప్రిన్సిపాల్ ఆచార్య నాగరాజకుమారి అన్నారు. వరల్డ్ ఫిలాసఫీ డే సందర్భంగా గురువారం ఏయూ ఐఏఎస్‌ఈ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి రోజుల్లో ఆధ్యాత్మిక జీవన విధానమే ఉన్నతమైనదన్నారు. సమాజంలో తత్వశాస్త్ర బోధనలకు సోక్రటీస్ దిక్సూచీగా నిలిచారని గుర్తుచేశారు. ముఖ్య అతిథి విశ్రాంత ఆచార్యుడు మదన్ మోహన్ మాట్లాడుతూ రవీంద్రనాథ్ ఠాగూర్, అరవిందో, వివేకానంద వంటివారి ఆధునిక తత్వం గొప్పతనాన్ని, వారు చెప్పిన ఉన్నత విలువలను గురించి వివరించారు. సోక్రటీస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ డాక్టర్ తిరుమలాంబ, సహ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ రహదారులే .. ఇలా..

- పేరుకుపోయిన దుమ్ము, ధూళి
- వాహనచోదకులు, పాదచారుల అవస్థలు



సాంబమూర్తినగర్ శివాలయం వద్ద దుమ్ము ధూళితో రహదారులు



భారీ వాహనాల రాకపోకలతో ధూళితో నిండిన రహదారులు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి పైడిమాంబ కాలనీ నుంచి దయానందనగర్, రాజీవ్‌కాలనీ, చాకలిగెడ్డ ప్రాంతాల్లో రహదారులు మట్టి రోడ్లను తలపిస్తున్నాయి. ఈ ప్రాంతాలకు వెళ్లాలంటే దుమ్ము పేరుకుపోయిన రహదారుల్లోనే ప్రయాణించాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది గుంతల రహదారిలో ప్రజలు ఇబ్బంది పడడంతో సీసీ రోడ్లు వేశారు. అయితే రోడ్లు శుభ్రపరచకపోవడంతో మట్టి రహదారులను తలపిస్తున్నాయి. దీంతో భారీ వాహనాలు రాకపోకలు సాగించేటప్పుడు ద్విచక్ర వాహనాలు, పాదచారుల కళ్లలోకి ధూళి చేరుతోందని వాపోతున్నారు. నిత్యం వేల సంఖ్యలో రైల్వే లోకో, డీజిల్ షెడ్ ఉద్యోగులు, నేవల్ డాక్‌యార్డ్, షిప్‌యార్డ్ ప్రాంతాల ఉద్యోగులతో పాటు ఆయా కాలనీ ప్రజలు ధూళితో ఇబ్బంది పడుతున్నారు. శానిటరీ సిబ్బంది ఇక్కడ మచ్చుకు కూడా కనిపించడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రహదారులను పరిశీలించి, రహదారులు శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తాత్విక ఆలోచనలతో ఒత్తిడి దూరం

విశాఖ విద్య: తాత్వికంగా, తర్కబద్ధమైన ఆలోచన అనుసరించడం ద్వారా జీవితంలో ఎదురవుతున్న ఒత్తిడిని అధిగమించవచ్చని ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు అన్నారు. ప్రపంచ తత్వశాస్త్ర దినోత్సవం సందర్భంగా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తత్వశాస్త్ర శాఖాధిపతి ఆచార్య వానపల్లి వెంకటరావు అధ్యక్షత వహించగా, తత్వశాస్త్ర విభాగ పూర్వాచార్యుడు వై.వి.సత్యనారాయణ 'నైతికత రాజకీయ బాధ్యత' అనే అంశంపై పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. ఆచార్య ఎం.వి. కృష్ణయ్య మాట్లాడుతూ సోక్రటీస్ జన్మదినం రోజున అంతర్జాతీయ తత్వశాస్త్ర దినోత్సవంగా మానవాళి ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రపంచ వ్యాప్తంగా చర్చ జరుగుతుండటం శుభపరిణామమన్నారు. ఆచార్య వెంకటరావు మాట్లాడుతూ ఈ ఏడాది 'సమష్టి, స్థిరమైన భవిష్యత్తు కోసం తత్త్వశాస్త్రం' అనే అంశంపై చర్చలు జరపాల్సి ఉందన్నారు. అధ్యాపకుడు డాక్టర్ ముసుగు ప్రసాద్ వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ అల్లాడ వీరభద్రరావు, డాక్టర్ బి.పి.ఎస్.కల్యాణి, డాక్టర్ ఎ.పద్మజ, డాక్టర్ దాక్షాయిని, డాక్టర్ దేవదానం, డాక్టర్ జె.శ్రీనివాసరావు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

పెదగంట్యాడ: విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని జిల్లా విద్యా శాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ అన్నారు. నెల్లిముక్కు ప్రాథమిక పాఠశాలతో పాటు గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులు పరిశీలించారు. విద్యార్థుల హాజరుపై ఆరా తీశారు. మధ్యాహ్నం భోజనం పథకం నిర్వహణ తీరును పరిశీలించారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. విద్యార్థుల వర్క్ బుక్స్, బోధన తీరుపై ఆరా తీశారు. బోధన, బోధనేతర కార్యక్రమాల్లో మండలంలోని పాఠశాలలు సాధిస్తున్న విజయాలపై సంతృప్తి వ్యక్తం చేశారు కార్యక్రమంలో మండల విద్యా శాఖాధికారులు ఇ.శ్రీనివాసరావు, కె.రమణాజీ పాల్గొన్నారు.



నెల్లిముక్కు ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేస్తున్న డీఈవో

కఠోర శ్రమతో లక్ష్య సాధన

సీతంపేట : కఠోర శ్రమ, లక్ష్య సాధన, వృత్తి పట్ల అంకిత భావం ఉంటే ఉన్నతంగా రాణించవచ్చని మాగ్నా ఇంటర్నేషనల్ (అమెరికా) సీఈవో కోటగిరి సీతారామస్వామి అన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయాన్ని గురువారం ఆయన సందర్శించి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులతో మాట్లాడారు. వారి కోసం గ్రంథాలయంలో కల్పించిన సౌకర్యాలు చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీతారామస్వామి మాట్లాడుతూ తాను అశ్వారావుపేటలో జన్మించానని, కర్ణాటకలో బిట్స్ పిలానీలో మెకానికల్ ఇంజినీరింగ్‌లో పట్టభద్రుడినై అమెరికాలో చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తూ ఉన్నత చదువులు చదివానని తెలిపారు. కష్టపడి సంపాదించుకోవడానికి ఎవరూ సంకోచించాల్సిన అవసరం లేదన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని స్వయంకృషితో ఎదిగానన్నారు. జనరల్ మోటార్స్‌లో ఉన్నత పదవిలో పనిచేసి లక్ష మందికి పైగా ఉద్యోగులతో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆటోమొబైల్ కంపెనీ సీఈవో స్థాయికి ఎదిగానన్నారు. లక్ష్య సాధన, కఠోర శ్రమ, అంకిత భావం ఉన్నత స్థాయికి చేర్చాయన్నారు. ఆత్మవిశ్వాసం ఉంటే లక్ష్య సాధనలో విజయం సొంతం అవుతుందని, ఫలితం ఆశించకుండా పని చేయాలని సూచించారు. సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ డైరెక్టర్ ఆచార్య ఎ.ప్రసన్నకుమార్, గ్రంథాలయ కార్యదర్శి డి.ఎస్.వర్మ పాల్గొన్నారు.

షిర్డీ సాయికి ప్రత్యేక పూజలు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు ఏపీఎస్‌ఈబీ కాలనీ శ్రీ షిర్డీ సాయి ధ్యానమందిరంలో బాబాకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పంచామృతాలతో అభిషేకం జరిపించారు. ప్రత్యేక అలంకరణ అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. బాబాను దర్శించుకున్న భక్తుల గోత్రనామాలతో అర్చకులు పూజలు నిర్వహించారు. సాయి సంకీర్తనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు విల్లా సత్యనారాయణ రావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.



సాయి సంకీర్తనలు ఆలపిస్తున్న భక్తులు